జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 8-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 561 పేజీలు: 4 వెల : రూ.7



## 'రావు'గారిపై.. విచారణకు.. రంగం సిద్ధం



* శ్రీకాకుళం జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిపై సర్కారు కొరడా * అక్రమాస్తులపై గతంలో ఏసీబీ దాడులు * విచారణాధికారిగా జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిదేవి నియామకం * పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని ఆదేశం * ఆరోపణలు నిజమని తేలితే రావుపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం

**శ్రీకాకుళం, జనవరి 7 (వార్త):** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ అధికారుల విషయంలో ఆంధ్రప్రదేశ్ సర్కారు కొరడా విదిలిస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీకాకుళం జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సాధికారత అధికారి దాసరి మధుసూదనరావుపై శాఖాపరమైన విచారణకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఆయనపై వచ్చిన అభియోగాలను నిగ్గుతేల్చేందుకు విచారణాధికారిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### నెల్లూరులో మొదలైన పాపం.. శ్రీకాకుళం దాకా!

మధుసూదనరావు గతంలో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో సాంఘిక సంక్షమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. చట్టబద్ధమైన ఆదాయ మార్గాలకు మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ అధికారులు గతంలోనే దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. దీనిపై 2020 నుంచి 2025 మధ్య కాలంలో ఏసీబీ డైరెక్టర్ జనరల్ పలుమార్లు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ప్రస్తుతం ఆయన శ్రీకాకుళం జిల్లాలో విధులు నిర్వహిస్తుండగా, ప్రభుత్వం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విచారణను వేగవంతం చేసింది.

### శాఖాపరమైన విచారణకు 'రంగ' ప్రవేశం

ఏపీసీఎస్ నిబంధనలు 1991 లోని రూల్ 20(2) ప్రకారం ఈ విచారణ కొనసాగనుంది. ఈ అక్రమాస్తుల కేసులో లోతైన విచారణ జరిపేందుకు సాంఘిక సంక్షమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మదేవిని విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది. మధుసూదనరావుకు వ్యతిరేకంగా గత డిసెంబర్ 30న జారీ చేసిన అభియోగ పత్రాలను విచారణాధికారికి ప్రభుత్వం అందజేసింది.

### నిర్ణీత గడువులోగా నివేదిక

ఈ కేసులో ఏసీబీ సమర్పించిన ఆధారాలు, మధుసూదనరావు వద్ద లభ్యమైన అక్రమాస్తుల వివరాలను రంగలక్ష్మదేవి నిశితంగా పరిశీలించనున్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత కాలవ్యవధిలోగా విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విచారణలో ఆరోపణలు నిజమని తేలితే మధుసూదనరావుపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.



అప్రమత్తత, సమన్వయంతో..

## రథసప్తమి బందోబస్తు

* జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * పోలీసు అధికారులతో సమీక్ష



**శ్రీకాకుళం, జనవరి7(వార్త):** రథసప్తమి వేడుకలను పటిష్ట బందోబస్తుతో నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ నెల 19 నుండి 25వ తేదీ వరకు అరసవల్లిలో జరగనున్న రథసప్తమి వేడుకలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుతంగా, సురక్షితంగా వేడుకలు నిర్వహించేందుకు చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో బుధవారం ఎస్పీ సమీక్షించారు. రథసప్తమి రోజున ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున ట్రాఫిక్ నియంత్రణ, హెలిప్యాడ్ భద్రత, పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్, బారికేడ్ల నిర్వహణ, సూచిక బోర్డుల ఏర్పాటు, భద్రతా చర్యలు, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అత్యవసర సేవల సమన్వయంపై ఎస్పీ పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులకు కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, డ్రోన్ కెమెరాల సాయంతో జనసందోహాన్ని పర్యవేక్షించాలన్నారు. భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే ప్రాంతాలు, ఇతర కీలక ప్రదేశాల్లో పోలీసు సిబ్బందిని అధికంగా వినియోగించాలని ఆదేశించారు. రూ.100 దర్శనం, ఉచిత దర్శనం క్యూలైన్లలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్నారు. హెలిప్యాడ్ భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం సబ్ డివిజన్ పోలీసు ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

## క్రైం వార్తలు

బీటెక్ వరకు చదివి.. ఆ పై..

### గంజాయి దళారీగా మారి..

* గంజాయితో ఒడిశా యువకుడు అరెస్ట్




**మందస, జనవరి 7(వార్త):** బీటెక్ చదివిన ఓ నిరుద్యోగి గంజాయి వ్యాపారాన్ని ఉపాధిగా ఎంచుకుని.. చివరికి కటాకటాల పాలయ్యాడు. కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ మీడియాకు బుధవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా దిగువహుండి బ్లాక్ గొలండ గ్రామానికి చెందిన జగన్నాథ్ బెహరా అనే 23ఏళ్ల యువకుడు ఇంజనీరింగ్ పూర్తి చేసి, నిరుద్యోగిగా ఉండడంతో బెంగుళూరు వెళ్లాడు. అక్కడ లుమాక్స్ కంపెనీలో రూ.15వేల జీతానికి పని చేయడం ప్రారంభించాడు. ఈలోగా అనారోగ్యంతో తిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు. అనంతరం నరేందర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. నరేందర్ ఫోన్ చేసి ఓ వ్యక్తి గంజాయి ఇస్తాడని, దాన్ని బెంగుళూరు తీసుకురమ్మని జగన్నాథ్ బెహరాకు చెప్పి డిసెంబరు 29న ఫోన్ పే ద్వారా నగదు బదిలీ చేశాడు. వీటి ధర మొత్తం 36 వేల రూపాయలుగా నిర్ధారించారు. గంజాయిని తీసుకుని జగన్నాథ్ బెహరా బరంపురం నుంచి ఓ ప్రైవేటు బస్సులో హరిపురం దిగి.. మందస రైల్వే స్టేషన్‌లో ట్రైన్‌ల వివరాలు ఆరా తీశాడు. విశాఖపట్నం వెళ్లడానికి రైళ్లులేవని చెప్పడంతో పలాసకు బస్సులో వెళ్లడానికి బ్యాగుతో వెళ్లుతుండగా మందస ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు అతడిని తనిఖీ చేశారు. బ్యాగ్‌ను తనిఖీ చేయగా 8కిలోల గంజాయి పట్టుబడింది. జగన్నాథ్ బెహరాను అరెస్ట్ చేసి, జుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు. ఈ కేసులో ఏ2గా గంగాప్రధాన్, ఏ3గా నరేందర్‌ను చేర్చినట్టు వారు తెలిపారు.

### గంజాయితో ఇద్దరు అరెస్టు

**పలాస, జనవరి7 (వార్త):** పలాస మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన సాహు ఆనంద్, నీలిభద్ర గ్రామానికి చెందిన బెహరా రమేష్ గంజాయిను తరలిస్తూ కాశీబుగ్గ పోలీసులకు బుధవారం పట్టుబడ్డారు. వీరు గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి యువతకు అమ్ముతుండేవారని పోలీసులు తెలిపారు. ఒడిస్సా రాష్ట్రం బరంపురం పట్టణానికి చెందిన పప్పు అనే వ్యక్తి వద్ద సుమారు నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి గోనెసంచిలో తరలిస్తుండగా కంబిరిగాం బ్రిడ్జి సమీపంలో పోలీసులు అదుపులో తీసుకున్నారని కాశీబుగ్గ డీఎస్పీ షేక్ సహబజ్ అహ్మద్ తెలిపారు. ఆయన వెంట కాశీబుగ్గ సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఆర్.నరసిం మూర్తి, పోలీసులు ఉన్నారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జరిమానా

**టెక్కలి, జనవరి 7 (వార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన సవర బాబురావు, రుంకు కృష్ణలపై టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. వీరిద్దరిని బుధవారం టెక్కలి జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, మెజిస్ట్రేట్ యు.మాధురి విచారణ అనంతరం ఒక్కొక్కరికి రూ.10,000లు చొప్పున జరిమానా విధించినట్లు టెక్కలి సీఐ విజయ్ కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, తరచుగా ఇలాంటి నేరాలకు పాల్పడిన వారికి జైలు శిక్ష కూడా విధించబడుతుందని సీఐ హెచ్చరించారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్‌లో.. పరిశుభ్రత మెరుగుపర్చండి

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఇచ్ఛాపురంలో వైసీపీ

## జెండా ఎగురవేస్తా

* అందరినీ కలుపుకొని పోతా
* నియోజకవర్గ సమన్వయకర్త శ్యాంప్రసాద్‌రెడ్డి

**ఇచ్ఛాపురం, జనవరి7 (వార్త):** రానున్న ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగురవేసి పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డికి కానుకగా ఇస్తామని సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తన నియామకాన్ని ప్రోత్సహించిన ఉత్తరాంధ్ర ప్రాంతీయ కన్వీనర్ కురసాల కన్నబాబుకి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జ్ కుంభా రవిబాబుకి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు, సీఈసీ సభ్యులు పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని ముందుకుసాగుతానన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 10న బాలిగాంలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

**మందస, జనవరి 7(వార్త):** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా బాలిగాంలో ఈ నెల 10న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివేక్ కోచింగ్ సెంటర్ ప్రతినిధులు చెప్పారు. ఈ నెల 10న శనివారం ఉదయం 10 గంటలకు బాలిగాంలోని శ్రీవెంకటేశ్వర మందిరం వద్ద పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ బహుమతి రూ.5000తో పాటు షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.4000, షీల్డ్, తృతీయ బహుమతి రూ.3000, షీల్డ్, నాల్గవ బహుమతి రూ.2000, షీల్డ్, ఐదో బహుమతి రూ.1000, షీల్డ్ అందజేస్తామన్నారు. 6, 7, 8 టీంలకు కూడా నగదు బహుమతి, షీల్డ్ ఇవ్వబడుతుందని, 6వ తరగతి నుంచి 10 వ తరగతి విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని, విద్యార్థులు ఐడీ కార్డు, ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకొని రావలని సూచించారు. ప్రతీ టీంకు నలుగురు సభ్యులు మాత్రమే ఉండాలని, ఒక పాఠశాల నుంచి ఎన్ని టీంలైనా పాల్గొనవచ్చన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేదన్నారు. టీంల పేర్లు ఈ నెల 9వ తేదీ లోపల నమోదు చేసుకోవాలని, పాల్గొనేవారికి భోజన సదుపాయం ఉంటుందన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ అనంతరం 8టీమ్‌లను తుది పోరుకు ఎంపిక చేస్తామన్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో ఒకేలాంటి స్కోర్ వస్తే, వరుసగా మాథ్స్, ఇంగ్లీష్ లో వచ్చిన అధిక స్కోర్ ఆధారంగా ప్రాధాన్యత ఇస్తామన్నారు. తెలుగు, ఇంగ్లీష్, మాథ్స్, సైన్స్, సోషల్, జీకే, కరెంట్ అఫైర్స్, మైథలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రాపిడ్ రౌండ్లపై ప్రశ్నలు ఉంటాయన్నారు. నిర్వాహకులదే తుది నిర్ణయమని, పాల్గొనే టీంలు 8712359757, 9493703569, 9491815718 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## ఎర్రముక్కాం బీచ్‌లో బెంగాల్ టూరిస్టులు



**సోంపేట జనవరి 7(వార్త):** ఎర్రముక్కాం బీచ్‌లో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన పలువు టూరిస్టులు బుధవారం సందడి చేశారు. అక్కుపల్లి బీచ్ నుంచి ఉదయం కాలి నడకన బయలుదేరి సాయంత్రానికి ఎర్రముక్కాం బీచ్‌కు చేరుకున్నారు. ఆంధ్ర తీరాన్ని కాలినడకన పర్యటించాలన్న ఉత్సాహంతో ఇలా బీచ్లు వెంబడి సముద్ర తీరం గుండా పాదయాత్ర చేస్తున్నట్లు వివరించారు. ఈ రాత్రికి పక్కనే ఉన్న ఎక్కవూరు గ్రామంలో బస చేసి అక్కడినుంచి గురువారం ఉదయం ఒడిశా గోపాల్ పూర్ బీచ్ వరకు కాలి నడకన వెళ్తామని తెలిపారు. ఎర్రముక్కాం బీచ్‌లో సహజంగా వెలసిన నల్ల రాళ్లు ఎంతో అందంగా ఉంటూ మమ్మల్ని ఆనందింపజేశాయని పేర్కొన్నారు.

## రబీ పంటలతో మంచి ఆదాయం



**సోంపేట జనవరి 7(వార్త):** ప్రస్తుత రబీ సీజన్లో ఆరుతడి పంటలతో రైతులు మంచి ఆదాయాన్ని సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు మండల వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తి పేర్కొన్నారు. తాళ్లభద్ర, మామిడిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రవి సాగులో పెసర, మినుము, నువ్వులు తదితర పంటల రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు. ఎరువుల యాజమాన్యాన్ని వివరించారు. పాటించాల్సిన మెళకువలు గూర్చి వివరించారు. టమాటా పంటకు సంబంధించి వ్యవసాయ సహాయకులు వద్ద సాగు వివరాలు నమోదు చేసుకోవాలని, అవసరమైన ఎరువుల వివరాలు గూర్చి తెలియజేయాలని సూచించారు. ఈ పంట నమోదు చేసుకోవాలని కోరారు.

## ఉద్దానం భూములను కాపాడుకుందాం

### -కార్గో ఎయిర్‌పోర్ట్ బాధిత రైతుల ప్రతిజ్ఞ



**మందస, జనవరి 7(వార్త):** ఉద్దానం భూములు కాపాడుకుందామని కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతులు ప్రతిజ్ఞ చేశారు. తెలగ గంగువాడలోని సామాజిక భవనం దగ్గర కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. 'కార్గో ఎయిర్ పోర్టుకు భూములు ఇవ్వమని, తమ ఊరు, తమ భూములు కాపాడుకుంటామని రైతులు ప్రమాణం చేశారు. దేశంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు పొందిన ఉద్దానం సంస్కృతి, వారసత్వాన్ని రక్షించుకుంటామని, తరతరాలుగా బువ్వను పెడుతున్న భూమిని కాపాడుకుంటామని, పర్యావరణాన్ని కాపాడుకుంటామని నినదించారు. కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఇచ్చిన అన్ని పిలుపుల్లో భాగస్వామి అవుతానని, ఎవరికీ.. ఎటువంటి ప్రలోభాలకు లొంగనని, జన్మ భూమి సాక్షగా ప్రతిజ్ఞ చేస్తున్నామని ముక్తకంఠంతో పలికారు. కార్యక్రమంలో చిత్త కూర్మారావు, చిత్త గున్నయ్య, చిత్త సంతోష్, లైసెట్టి కృష్ణారావు, దాసరి మోహన్, లైసెట్టి నారాయణ, చిత్త హేమరాజు, పుక్కల నారాయణ, గుంటు లోకనాథం, జోగి శారద, అడనల గున్నమ్మ, పొట్టి అప్పలమ్మ, ఎలుమల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి ఎంపీపీ దాసు పరామర్శ



**సోంపేట జనవరి 7(వార్త):** సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు బుధవారం కొర్లాంలో పలువురిని పరామర్శించారు. రిటైర్డ్ పశు వైద్య శాఖ ఉద్యోగి రత్నాల సుందరరావు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుందరరావుతో తన అనుబంధాల్ని, ఆయన కుమారుడు శ్రీనివాస్‌తో పంచుకున్నారు. ఆయన వెంట వైసీపీ నేతలు పైడి పట్టాభి, రామారావు, తామాడ మోహన్, కె.శ్రీనివాసరావు,బి.శ్రీనివాసరావు, బాలరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చింద్రలో రోడ్డు పను పరిశీలన

**ఇచ్ఛాపురం, జనవరి 7(వార్త):** ముచ్చంద్ర రోడ్డు పనులను జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి బుధవారం పరిశీలించారు. పంచాయతీలోని జగనన్న కాలనీకి రూ.20 లక్షల వ్యయంతో కూటమి ప్రభుత్వం, నాయకుల సమక్షంలో రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భబస్త్రంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా పంచాయతీలను అభివృద్ధి చేయడమే లక్ష్యంతో ముందుకెళ్తుందన్నారు. ముచ్చంద్ర గ్రామ ప్రజలు గ్రామ నాయకులు ఇటువంటి అభివృద్ధి మునుపు ఎన్నడూ లేదని అభివృద్ధిని చూసి చాలా సంతోషిస్తున్నారన్నారు.



# ఎంతటి వారైనా తాట తీస్తా

### -పలాసలో అక్రమ గ్రావెల్ దందాపై
### -ఎమ్మెల్యే గౌతు శిరీష తీవ్ర ఆగ్రహం
### - ఇకపై ఉపేక్షించేది లేదు!
### -అధికారులకు పూర్తి స్వేచ్ఛ
### -తన పేరు చెప్పినా వద్దలొద్దని ఆదేశం

**పలాస, జనవరి 7 (వార్త):** కొండలను కొల్లగొడుతూ, ప్రభుత్వ ఆస్తులను చెర బడుతున్న అక్రమ గ్రావెల్ మాఫియా వారు ఎంతటివారైనా తాట తీస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆమె పోలీస్, రెవెన్యూ, మైనింగ్, రవాణా శాఖల అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆమె మాట్లాడారు. "గతంలో జరిగింది ఒక లెక్క, ఈరోజు నుంచి మరో లెక్క.. అక్రమంగా ఎవరు తవ్వకాలు జరిపినా, వారి వెనుక ఎవరున్నా ఉపేక్షించేది లేదని తీవ్రంగా హెచ్చరించారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నానని, తన పేరు చెప్పినా వదలొద్దని అధికారులకు స్పష్టం చేశారు. తాను చేయని తప్పునకు నిందలు మోయడానికి సిద్ధంగా లేనని, ఏ అధికారిపైనా రాజకీయ ఒత్తిడి ఉండదని, అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను తక్షణమే సీజ్ చేయండని, జరిమానా వేయాలని, అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితి వీఆర్వోలకు తెలియకుండా ఉండదని, ఇకపై ఎక్కడ అక్రమం జరిగినా సంబంధిత అధికారిదే బాధ్యతని, వారిని కలెక్టర్‌కు సరెండర్ చేస్తానని హెచ్చరించారు.

### చట్టబద్ధమైన గ్రావెల్ క్వారీలు లేవు : ఏడీ

ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) బి. విజయలక్ష్మి పలాస నియోజకవర్గంలోని పరిస్థితిని వివరించారు. "పలాస, మందస, వజ్రపు కొత్తూరు మండలాల్లో కలిపి మొత్తం 21 లీజులు ఉండగా, వాటిలో అత్యధికం పర్యావరణ అనుమతులు, రెవెన్యూ బకాయిలు వంటి కారణాలతో పనిచేయ డం లేదన్నారు. ప్రస్తుతం పలాస నియోజకవర్గంలో అధికారికంగా పనిచేస్తున్న గ్రావెల్ క్వారీ ఒక్కటి కూడా లేదని తెలిపారు. అభివృద్ధి పనులకు, ప్రభుత్వ అవసరాలకు గ్రావెల్ అవసరమైతే, సంబంధిత శాఖలు ఉచిత పర్మిట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాణిజ్య అవసరాలకు లేదా ప్రైవేట్ వ్యక్తులు క్వారీల కోసం మైనింగ్ శాఖ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. దీర్ఘకాలిక పరిష్కారంగా, ఏపీఎండీసీ ద్వారా వజ్రపు కొత్తూరు మండలంలో రెండు పెద్ద క్వారీలను ప్రతిపాదించామని, అవి అందు బాటులోకి వస్తే సమస్య చాలా వరకు తీరుతుందని ఆమె వివరించారు.



### ప్రతిపక్షాలు, మీడియాకు సూచన

గత ప్రభుత్వ హయాంలో కొండలు కరిగిపోయినప్పుడు మాట్లాడని వారు, ఇప్పుడు కొండలను రక్షించాలని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ప్రతిపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. అక్రమ తవ్వకాలపై వార్తలు రాస్తున్న మీడియా, ఆ తవ్వకాలు జరుపుతున్న వ్యక్తుల పేర్లను కూడా ప్రచురిస్తే, చర్యలు తీసుకోవడానికి తమకు మరింత సులభమవుతుందని ఆమె మీడియా ప్రతినిధులను కోరారు.

### జగన్నాథ సాగరం ఆక్రమణలపైనా చర్యలు

ఈ సమావేశంలో జగన్నాథ సాగరం చెరువు ఆక్రమణల అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. ఇప్పటికే 31 సెంట్ల భూమి ఆక్రమణకు గురైందని రెవెన్యూ అధికారుల నివేదిక ఇచ్చారని, దీనిపై ఎంతటివారైనా సరే క్రిమినల్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న జేసీబీ, ట్రాన్స్‌పోర్ట్ యజమానులు చట్టబద్ధంగా వ్యాపారం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, అయితే అనుమతుల ప్రక్రియను "సింగిల్ విండో" విధానంలో సులభతరం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

### -వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు

**మందస, జనవరి 7(వార్త):** రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా గ్రామీణ ప్రాంత రైతులకు మంచి ఆదాయంతో పాటు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా అవతరించవచ్చని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు(ఎన్.ఎం.ఎన్.ఎఫ్.), నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్(ఐటీడీఏ) డీపీఎం స్వర్ణలత ఆధ్వర్యంలో జరిగిన సిబ్బంది కన్వర్జెన్సీ అవగాహన, సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో వన్ ధన్ వికాస కేంద్రాల ఏర్పాటు చేసి గ్రామీణ మహిళా రైతులకు ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపులు, ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేసి, వారికి అవసరమైన యంత్రాలు పనిముట్లుతో సహా ఉత్పత్తికి అవసరమైన రుణ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో భూమి ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతున్న అధిక మోతాదులో రసాయన ఎరువులు, కలుపు మందులు, క్రిమి సంహారక కెమికల్స్ వాడకుండా పశువుల ఎరువు, పెంటగత్తం, వర్మీ కంపోస్ట్, ఘన జీవామృతం, కషాయాలతో నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుతూ అధిక ఉత్పత్తులను సాధించవచ్చని వివరించారు. నేలకు మేలు చేసే పోషకాలను అందించే నవధాన్యాల సాగు, అంతర పంటల విధానంతో రైతులకు అధిక ఆదాయం కూడా వస్తుందని తెలిపారు. డీపీఎం స్వర్ణలత మాట్లాడుతూ ప్రతి రైతు తనకి ఉన్న భూమిలో కనీసం 50% ఏ గ్రేడ్ గా తయారు చేసుకుని ఏటీఎం మోడల్‌ననుసరించి ఏడాది పొడవునా కూరగాయ పంటలను పండించాలని సూచించారు. నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ ముసలయ్య మాట్లాడుతూ అన్ని గ్రామ సంఘాల్లో అర్హత గల రైతులను గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్ బాలకృష్ణ, సంతోష్‌కుమార్, విశ్వనాథ, అన్ని గ్రామాల నుంచి ఐసీఆర్పీలు, ట్రైనీ ఐసీఆర్పీలు పాల్గొన్నారు.




## పంచాయతీ నిధులపై ఆంక్షలు పెట్టొద్దు



**సరుబుజ్జిలి, జనవరి 7(వార్త):** పంచాయతీ నిధులకు ఆంక్షలు పెట్టవద్దని పలువురు సర్పంచులు ప్రభుత్వాన్ని కోరారు. సరుబుజ్జిలి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచులు బెండి అప్పలనాయుడు, సురవరపు తిరుపతిరావు, గజ్జన మోహనరావు రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధులపై అంక్షలు విధించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామపంచాయతీలోని పలు అభివృద్ధి పనుల్లో కొన్ని పర్తై, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని, ప్రస్తుత జీవోతో నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతటో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా పారిశుధ్య, తాగునీరు, గ్రామ సచివాలయాల నిర్వహణ ఖర్చులు గ్రామ పంచాయతీలకు అధిక నిధుల వినియోగంపై ఆంక్షలను ఎత్తివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చర్యలు తీసుకొని సర్పంచులకు సహకరించాలని ముక్తకంఠంతో కోరారు. సమావేశంలో సర్పంచులు గోవిందు కామేశ్వరి, మూడట్ల భద్రమ్మ, బొడ్డేపల్లి చాందిని, వెంకటసూర్య, ఎస్.గురువులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎన్ఈఆర్, తమ్మినేని పరామర్శ



**జి.సిగడాం, జనవరి 7(వార్త):** పెంట గ్రామానికి చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ అలుగోలు సురేష్ తల్లి సీతారత్నం, సింహాద్రి విజయశంకర్ కుమారుడు శరత్‌చంద్ర ఇటీవల మృతిచెందారు. దీంతో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

వీరి వెంట వైసీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎర్నైన ప్రకాశరావు, పెంట సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి మక్క శ్రీనివాసరావు, గ్రామ కూటమి నాయకులు మక్క నారాయణరావు, టీడీపీ మండల అధ్యక్షులు కుమరాపు రవికుమా ర్, బీజేపీ మండల అద్యక్షులు పైల విష్ణుమూర్తి, మండల జనసేన అధ్య క్షుడు మీసాల రవికుమార్, జి.సిగడాం, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, సర్పంచ్ దారబోయిన ధర్మరాజు, నాయకులు పడాల అప్పన్న మాష్టారు, శ్యామలరావు, కుటుంబసభ్యులు సింహాద్రి సూర్యనారాయణ ప్రదీప్ కుమార్, ఆనందరావు, లీలామోహన్, వాసుదేవరావు, అలుగోలు రాజశేఖర్, సుధాకర్, లక్ష్మణరావు, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, విరేజి సనత్‌కళ్యాణ్, గ్రామస్తులు మీసాల రమణ, సూరిబాబు, మక్క గిరి, మీసాల సూరిబాబు తదితరులు ఉన్నారు.



## శ్యాంప్రసాద్‌రెడ్డికి దాసు అభినందనలు

**సోంపేట జనవరి 7(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గం నూతన సమన్వయకర్తగా నియమించబడిన సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు



అభినందించారు. బుధవారం శ్యాం ప్రసాద్ రెడ్డి ని కలిసి డాక్టర్ దాసు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గం లో 2029లో జరిగే ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగిరేందుకు సమన్వయ అధికారిగా మంచి సమన్వయంతో అందరినీ ఏకతాటిపైకి తెచ్చి పార్టీని మరింత పటిష్టపరిచి విజయానికి కృషి చేయాలని కోరారు. ఎందుకు తమ సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు చల్ల దేవరాజు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సోంపేటకు అందరూ సహకరించాలి



**సోంపేట జనవరి 7(వార్త):** సోంపేటలో గతానికి భిన్నంగా పారిశుధ్యం విషయంలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఆరోగ్యకరమైన సుందరమైన పట్టణాన్ని ప్రతి ఒక్కరూ చూడాలన్న ఆలోచనతో స్వచ్ఛ సోంపేట అనే కాన్సెప్ట్ తో గ్రామపంచాయతీ తీసుకున్న నిర్ణయానికి పంచాయతీ ప్రజలంతా సహకరించాలని ఈవో ఎం శాంతకుమారి పిలుపునిచ్చారు. పంచాయతీలో ప్రతి వీధిలోను పంచాయతీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించి వారి వారి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రానున్న సంక్రాంతి సందర్భంగా పట్టణంలో వీధులన్నీ పరిశీలించి ప్రజల స్వచ్ఛందంగా పారిశుధ్యపరంగా చక్కగా తీర్చిదిద్దిన వీధిని గుర్తించి స్వచ్ఛ సోంపేట అవార్డులను ఆయా వీధులకు ప్రధానం చేస్తామని అన్నారు. పంచాయతీ ప్రజలు పారిశుధ్యం తమ ఆరోగ్యానికి సంబంధించిన అంశంగా పరిగణించి ప్రతి ఒక్కరూ పంచాయతీ కార్యక్రమాలకు సహకరించి అందరం కలిసి సోంపేట పట్టణాన్ని తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. అందరూ సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పేర్కొన్నారు.

## రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నరసన్నపేట, జనవరి 7(వార్త):** నరసన్నపేట మండల పరిషత్ నిధులతో రహదారి నిర్మాణ పనులను చేపడుతున్నట్లు ఎంపీటీసీ కేశవరాజు తెలిపారు. ఆదివారపు పేట నుంచి బొరిగివలసకు వెళ్లే రహదారి అభివృద్ధి కోసం రూ.2 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ రహదారి నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చింతు రామారావు, సుడా మాజీ చైర్మన్ కోరాడ చంద్రభూషణ్, వార్డు మెంబర్ సింహాచలం పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నెలాఖరులోగా స్వమిత్వ సర్వే పూర్తి చేయాలి

**ఇచ్ఛాపురం, జనవరి 7(వార్త):** ఈనెల 31లోగా 10 పంచా యతీల్లో స్వమిత్వ సర్వే పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్పీఓ ఐవీ రమణ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. బుధ వారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రభాకరరావు అధ్య క్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్పీఓ మాట్లాడుతూ 21 పంచాయతీల్లో ప్రభుత్వం డ్రోన్ సర్వే పూర్తి చేసి వాటికి సంబంధించిన మ్యాప్‌లు కూడా అందజేసిందన్నారు. 11 పంచా యతీల్లో స్వమిత్వ సర్వే పూర్తి అయ్యిందని. మిగిలిన 10 పంచాయతీలు అరకబద్ర, బిర్లంగి, ఈదుపురం, కేదారిపురం, కొఠారి, లొద్దపుట్టి, మండ పల్లి. ముచ్చింద్ర, కీర్తిపురం, పాయితారిల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్వేరర్, వీఆర్‌వో కలిసి ముమ్మరంగా ఇంటింటి సర్వే జరిపి ఇంటి కొలతలు వివరాలు సేకరించాలన్నారు. అనంతరం గ్రామ సభలు ఏర్పాటు చేసి సేకరించిన ఇంటింటి వివరాలు ప్రజలకు తెలియజేయా లని తెలిపారు. అన్ని గ్రామాల్లో స్వచ్ఛ సంక్రాంతి నిర్వహించాలన్నారు. అన్ని పంచాయతీల్లో రంగు..రంగుల ముగ్గులతో గ్రామ ద్వారాలు మామిడి తోరణాలతో కట్టి సంక్రాంతి పండగ వాతావరణం తీసుకు రావాలని తెలిపారు. ఇంటి పన్నుల బకాయిలను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. స్వచ్ఛ సంపద తయారీ కేంద్రా లుగా(సాలూడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ సిస్టం)గా తీర్చిదిద్దాలని కోరారు.




# రీ సర్వే పూర్తయితే రాజముద్రతో పాస్ పుస్తకాలు

**-రైతులకు కొత్త సంవత్సర కానుక**

**-రైతన్న సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**-ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు**



**జి.సిగడాం, జనవరి 7(వార్త):** ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, భూమికి సంబంధించిన సేవలను సరళీకృతం చేసి భావితరాలు భూసమస్యలతో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్) అన్నారు. బుధవా రం ఆయన గేదేలపేట గ్రామంలో రాజముద్రతో కూడిన పట్టా పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నాటి సీఎం ఫొటోలతో భూమి హక్కు పత్రాల పంపిణీ చేశా న్నారు. ఆ చర్యలపై ప్రజల అసంతృప్తి నేపథ్యంలో రీ సర్వే తప్పులను సరిదిద్ది కొత్త పాస్‌పుస్తకాలు ఇస్తున్నామన్నారు. దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్య మన్నారు. భూమే ప్రాణంగా బతికే రైతులకు భూ సమస్యలు లేకుండా చేయ డమే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలను అభద్రతకు దూరం చేశామన్నారు

. రీ సర్వే పూర్తయిన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాస్ పుస్తకాల పంపిణీ ప్రారంభమైందన్నారు. పాస్ పుస్తకాలపై నాటి పాల కులు తమ బొమ్మలకు రూ.22 కోట్లు తగలేశారని, ఇప్పుడు మాజీ ముఖ్య మంత్రి వైస్. జగన్ బొమ్మలతో ఉన్న పాస్ పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న పుస్తకాల పంపిణీపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. ప్రజలకు భూవివా దాలు లేకుండా చేయడం మన ప్రథమ కర్తవ్యం కావాలని, నిర్దిష్ట సమయాన్ని లక్ష్యంగా పెట్టుకుని సంబంధిత అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గేదేల మల్లిబాబు, ఎంపీటీసీ గేదేల వరలక్ష్మ, తహసీ ల్దార్ ఎం.సరిత, రీ సర్వే డీటీ కొత్తపల్లి గాయత్రి, మండల కూటమి అధ్యక్షులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, మీసాల రవికుమార్, ఏఎంసీ ఉపా ధ్యక్షుడు బురాడ వెంకటరమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, నక్క మురళీ, బీజేపీ జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం, సాకేటి నాగరాజు, బోగాది అప్పలనాయుడు, జిల్లా జనసేన నాయకులు తాళ్లబత్తుల పైడిరాజు గేదేల రామకృష్ణ, చింత భాస్కరరావు, పొగిరి అప్పలనాయుడు, చిరంజీవి, గేదేల రమణ, వరహాల నాయుడు, ఖండాపు చిన్నప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పైల శ్రీరాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను ప్రారంభించిన శిరీష



**పలాస, జనవరి 7 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 27వ వార్డు ఉదయపురంలో సుమారు రూ. 27.5 లక్షల నిధులతో భద్రమ్మ పార్క్ ప్రహరీ నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం ఎమ్మెల్యే శిరీష ప్రారంభించారు. అనంతరం రైతు శిక్షణ కేంద్రం నుంచి పాతపట్నం అమ్మవారి గుడి వరకు సుమారు రూ. 16 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ శ్రీనివాసులు, వజ్జ బాబూరావు, పి విఠల్ రావు, వార్డు ఇంచార్జ్ గురిటి సూర్యనారాయణ, మళ్లా శ్రీనివాసరావు, రవిశంకర్ గుప్తా, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సప్ప నవిన్, రాంబాబు, గోళ్ల చంద్రరావు, చిన్ని, గాలి కృష్ణారావు, శంకర్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## పవర్ బోర్ ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష



**పలాస, జనవరి 7 (వార్త):** పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 27వ వార్డు శ్రీని వాసనగర్‌లో పవర్ బోరును ఎమ్మెల్యే శిరీష బుధవారం ప్రారంభించారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ శ్రీనివాసులు, వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, వార్డు ఇన్‌చార్జి గురిటి సూర్యనారాయణ, మళ్లా శ్రీనివాసరావు, రవి శంకర్ గుప్తా, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, రాంబాబు, గొళ్ళ చంద్రరావు, చిన్ని, గాలి కృష్ణారావు, శంకర్, టీడీపీ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలి



**పలాస, జనవరి 7 (వార్త):** అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులపై సమర్థంగా ఎదుర్కోవాలని పలాస అగ్నిమాపక శాఖ అధికారి బి సోమేశ్వరావు తెలిపారు. ఎన్ఎస్–ఎస్ ఆరవ రోజు కార్యక్రమంలో అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులపై బుధవారం అవగాహన కల్పించారు. పలాస గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పలాస అగ్నిమాపక అధికారి బి. సోమేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఒకప్పుడు అగ్ని ప్రమాదాల సమయంలో మాత్రమే అగ్నిమాపక శాఖ స్పందించేదని, ప్రస్తుతం విపత్తుల నిర్వహణలో భాగంగా వివిధ రకాల ప్రకృతి, మానవసృష్ట విపత్తులకు కూడా ఈ శాఖ సేవలందిస్తోందని తెలిపారు. నివారణఅగ్ని ప్రమాదాల సమయంలో మొదట గ్యాస్ మూలాలు మూసేసి, తడి టవల్ లేదా కుండ మూతతో ఆక్సిజన్ కట్టడం మంటలను ఆర్పగలదు. ఇసుక లేదా పారతో కప్పడం నీటి మంటలకు సహాయపడుతుందని, అగ్నిమాపక యంత్రాలు ఉంటే వాటిని తప్పక ఉపయోగించాలని వివరించారు. విపత్తులు ఏ రూపంలో, ఎటు నుంచి వస్తాయో ముందుగా అంచనా వేయడం కష్టమని పేర్కొన్నారు. తుఫానుల సమయంలో భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తాయని, అటువంటి పరిస్థితుల్లో వరదల్లో చిక్కుకున్న ప్రజలను పడవల ద్వారా రక్షించడం, ముంపునకు గురైన ఇళ్లలో పేరుకుపోయిన బురదను తొలగించడం వంటి సేవలు అగ్నిమాపక సిబ్బంది నిర్వహిస్తారని వివరించారు. రోడ్డు ప్రమాదాలు, భూకంపాల సమయంలో శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడం కూడా అగ్నిమాపక శాఖ బాధ్యతలలో భాగమని తెలిపారు. గృహ వినియోగ గ్యాస్ ప్రమాదాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రదర్శన రూపంలో చూపించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన నివారణ చర్యలను, అగ్నిమాపక పరికరాల సహాయంతో ప్రదర్శించి వివరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు ఎం.హెచ్.కే. ప్రసాద్ ఆరోగ్యం, పరిశుభ్రతపై పాటించవలసిన నియమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. మధు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఎన్జీవోస్ జిల్లా జాయింట్ సెక్రటరీకి ఘన సత్కారం

**పలాస, జనవరి 7 (వార్త):** పలాస ఎంపీడీవో కార్యాలయంలో ఇటీవల శ్రీకాకుళం జిల్లా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా జాయింట్ సెక్రటరీగా కొర్ల మన్మథ రావు ఎన్నుకోబడ్డ సందర్భంగా పలాస ఏపీ ఎన్జీవో అసోసియేషన్, ఎంపీడీవో, గ్రీన్ ఆర్మీ, పంచాయతీ కార్యదర్శుల సంఘం బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కే.వసంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీస్తుళు తున్న క్రమంలో సంఘ నాయకులుగా ఎన్నుకోబడ్డ వారు ఉద్యోగుల హక్కులు బాధ్యతలు కోసం అవగాహన కలిగించి సంఘాల నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో అధ్యక్షులు బోనేల గోపాల్ , డిప్యూటీ ఎంపీడీవో మెట్ట.వైకుంఠరావు, డి.తిరుమలరావు,. డిప్యూటీ జిఎస్డబ్ల్యూ ఉమాపతి, ఏవో అనురాధ, పంచాయతీ కార్యదర్శి సద్గుణబాబు, వెటర్నరీ అధికారి కొర్ల కళ్యాణ్ బాబు, కోపరేటివ్ అధికారి దుర్గాప్రసాద్ పట్నాయక్, మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ అధికారి ఉదయ శంకర్ పాత్రో, ట్రెజరీ అధికారి వాయిల పల్లి త్రివేణి, ఉపాధ్యాయులు మధుబాబు, అంబల కృష్ణారావు, గేదెల జగదీశ్వరరావు, గ్రీన్ ఆర్మీ సభ్యులు నక్క అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



**నరసన్నపేట, జనవరి 7 (వార్త):** త్యాగరాజ స్వామి వారి 179వ ఆరాధనోత్సవాలు నరసన్నపేటలో బుధవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. పెద్దపేట శారద సంగీతాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరియు నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, సంగీత కళను ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో శారద సంగీతాలయాన్ని నరసన్నపేట ప్రాంతంలో స్థాపించడం ఈ ప్రాంత వాసులకు లభించిన గొప్ప అవకాశమని అన్నారు. సంగీత విద్యను సుస్థిరంగా అందించేందుకు పాఠశాలకు సొంత భవనం అవసరమని గుర్తించి, తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రియంవద సారథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన సంగీత విద్యను అందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. త్యాగరాజ స్వామి కీర్తనలు తరతరాలకు అందేలా సంగీత కళాకారులు చేస్తున్న సేవ అమూల్యమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేసినందుకు నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు అడపా చంద్రశేఖర్, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ గొద్దు చిట్టిబాబు, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, పీస కృష్ణ, సరిపల్లి మధు, రావాడ గణపతిరావు, తాళాబత్తుల గోవిందరావు, దుప్పలపూడి లక్ష్మణరావు, కేలం చిరంజీవి, దొడ్ల మల్లేశ్వరరావు, మొయ్యి హరికృష్ణ, కూన రమేష్ తదితర ప్రజాప్రతినిధులు, సంగీత కళాకారులు, ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూర్ణాటకంలో పాస్ పుస్తకాల పంపిణీ



**ఇచ్ఛాపురం, జనవరి 7(వార్త):** పూర్ణాటకంలో బుధవారం డిప్యూటీ తహశీల్దార్ సంతోష్ కుమార్ అద్వర్యములో రాజముద్ర తో నున్న పట్టాదారు పాసుపుస్తకాలు అన్నదాత లు కోసము ముందుకి వచ్చి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమం లో సంతోష్ కుమార్, మాజీ ఎంపిపి దక్కతఢిల్లీరావు లు మాట్లడుతూ ఈ రాజముద్ర తో నున్న పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులు కు ఉపయోగం గూర్చి వివరించి రైతు పంట ఋణాలు గూర్చి, అన్నదాత పరిహారం గూర్చి వివిధ లోన్లు గూర్చి మన రైతులు పంట ఉత్పత్తులు నష్ట పరిహారం గూర్చి ప్రభుత్వము ఇస్తున్న అన్ని ఉపయోగాలు గూర్చి వివరించి చెప్పారు.కార్యక్రమంలో, దక్కతకామేశ్వరరావు ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్,ఆర్.ఐ సాహు, ఎస్.సహదేవ్, బి. రాజేంద్ర ప్రసాద్, అంబట ఈశ్వరరావు నీటి సంఘం అధ్యక్షులు,బోర యువరాజు,వీఆర్వో దున్న శ్రీనివాస్, సారథి , జగ్గారావు,పూర్ణాటకము రైతులు,మహిళలు పాల్గొన్నారు.

# విద్యార్థినిలను సొంత బిడ్డల్లా చూడాలి



**మందస, జనవరి 7(వార్త):** విద్యార్థినిలను సొంత బిడ్డల్లా చూసుకోవాలని గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ వై.యశోదలక్ష్మ కోరారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, కళాశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా యశోదలక్ష్మ మాట్లాడుతూ పేద విద్యార్థినిలను వసతిగృహాల్లో చదువుకుంటారని, వారిని ఎంతో చక్కగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రిన్సిపల్, ఉపాధ్యాయినిలపై ఉందన్నారు. ప్రభుత్వం ఎంతో బాధ్యతగా విద్యార్థినిలకు సౌకర్యాలు కల్పిస్తోందని, అన్ని సదుపాయాలు విద్యార్థినిలకు కల్పించి, సార్థకత తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా చదువుకుని, విద్యార్థినిలు మంచిమార్కులు సాధించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో భయం వీడనాడాలని, చదువుకోవడానికి మెళుకువలు తెలిపారు. సమస్యల్లేని గురుకులంగా పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థినిలతో మాట్లాడి, గురుకులం నిర్వహణ, పనితీరు, సౌకర్యాలు, సదుపాయాలపై ఆరా తీశారు. వంటగది, వంటలను తనిఖీ చేశారు. స్వయంగా విద్యార్థులకు వండిన వంటలను భుజించి, సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల సమన్వయకర్త వై.యశోదలక్ష్మతో పాటు ప్రిన్సిపల్ లఖినాన లక్ష్మ, ఉపాధ్యాయినిలు, సిబ్బంది కూడా ఉన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన



**సారవకోట, జనవరి 7(వార్త):** సారవకోట మండలం అంగూరు గ్రామ పంచాయతీలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మోహన్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన గ్రామంలో పర్యటించి, జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను వెంటనే తొలగించి తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల పెరుగుదలతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, గ్రామంలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన తెలిపారు. ప్రజలు స్వచ్ఛత పాటిస్తూ, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అప్పన్న, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొని పారిశుద్ధ్య పనుల నిర్వహణపై సమన్వయంతో చర్యలు చేపట్టారు. గ్రామాన్ని ఆరోగ్యవంతంగా ఉంచేందుకు అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాలని ఎంపీడీఓ మోహన్ కుమార్ పిలుపునిచ్చారు.

## పాస్ పుస్తకాలకు ఈ-కేవైసీ తప్పనిసరి



**నరసన్నపేట, జనవరి 7 (వార్త):** ప్రభుత్వం అందిస్తున్న పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని తహశీల్దార్ టి. సత్యనారాయణ తెలిపారు. బుధవారం నరసన్నపేట మండలం బాడం, తోటాడ రెవెన్యూ గ్రామాల్లో రాజముద్రతో కూడిన సుమారు 400 పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తిచేసిన రైతులకే ప్రభుత్వ ప్రయోజనాలు సక్రమంగా అందుతాయని తెలిపారు. అందువల్ల ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. పాస్ పుస్తకాలలో ఏవైనా వివరాల్లో తప్పిదాలు ఉంటే వాటిని తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన రైతులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## మహర్షిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు



**సోంపేట, జనవరి 7(వార్త):** సోంపేటలోని మహర్షి విద్యానికేతన్ లో ముందస్తు సంక్రాంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు అందరూ కలిసి సంక్రాంతి సంబరాలను ఆస్వాదించారు. సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు వీటిపై మరింత అవగాహన కల్పించేందుకు మహర్షి యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాన్ని అన్ని వర్గాలు హర్షించాయి. సంక్రాంతి విశిష్టత, ఈ పండగ జరుపుకునే తీరు, బంధుమిత్రుల కలయిక, పెద్దలకు పూజించడం, భోగి సంక్రాంతి కనుమ విశిష్టత ఇలా ఎన్నెన్నో ప్రాధాన్యతలతో కూడిన సంక్రాంతి వైభవాన్ని భవిష్యత్తులో కొనసాగించుకునేలా చేపట్టిన మహర్షి ప్రయత్నానికి అన్ని వర్గాలు శభాష్ అన్నాయి. ఈ సందర్భంగా సంక్రాంతి అంటే పిండి వంటల ప్రాధాన్యాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించడంతో వారు స్వయంగా తయారుచేసిన వంటలను పాఠశాలకు తీసుకువచ్చి పిండి వంటల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. హాజరైన ప్రతి ఒక్కరిని ఈ కార్యక్రమం కనువిందు చేసింది. దీంతోపాటు విద్యార్థులకు ముగ్గుల పోటీలు సాంస్కృతిక పోటీలు నిర్వహించి మహర్షి యాజమాన్యం బహుమతులు కూడా అందించనున్నారు. ఏది ఏమైనా సంక్రాంతి సంబరాలతో రాబోయే తరానికి సాంస్కృతిక వారధిగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం పట్ల మహర్షి యాజమాన్యాన్ని సర్వత్రా అభినందిస్తున్నారు.

## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ

**పలాస, జనవరి 7 (వార్త):** జాతీయ యువజన ఉత్సవాల వారోత్సవాలలో భాగంగా బుధవారం పలాస మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జి యూ. మాధురి ఆధ్వర్యంలో పలాస ప్రభుత్వ డిగ్రీ కాలేజీతో కలిసి ఈ ర్యాలీ నిర్వహించారు. మత్తు వద్దు జీవితం ముద్దు, మత్తు వదిలితేనే యువతకు భవిత వంటి నినాదలతో ఈ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రమేష్, ఏ జి పి పిండి వెంకట్రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్, బీకేర్ పట్నాయక్, జి ఎం ఎస్ అనిల్ రాజ్, ఎస్ వెంకట్రావు, ఎస్ నాగేశ్వరరావు, విగ్నేష్, కే దేవరాజ్, శ్యాంసుందర్రావు, జి ప్రభాకర్ రావు,సుధారాణి, లోకేశ్వరరావు, వి రవి, చిట్టిబాబు, రవికుమార్, శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్ లక్ష్మ, కోర్ట్ కానిస్టేబుల్స్ శ్రీనివాస్, కోటేశ్వరరావు, ధర్మ రావు, సూపరడెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## కళావేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష



**పలాస, జనవరి 7(వార్త):** పలాస ప్రభుత్వ పాఠశాలలోని కళా వేదికను బుధవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి-4 కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గంలో మొదట విద్యా వ్యవస్థ నుంచి ప్రారంభించడం చాలా శుభదాయకమని ఎమ్మెల్యే తెలి పారు. పి-4 కార్యక్రమంలో భాగంగా రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఆడిటోరియం, కళావేదికలను పలాస ఎమ్మెల్యే ప్రారంభిం చారు. ప్రవాసాంధ్రులు, విద్యాదాత, ప్రముఖ సైంటిస్టు డాక్టర్ కణితి హేమాచలం తను చదువుకున్న పాఠశాలకు, ఇతర ప్రాంతాలను అభి వృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో కనితి గ్లోబల్ గ్రాండ్ అనే సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కనితి గ్లోబల్ గ్రాంట్స్ సాకారంతో 15 లక్షల రూపాయలు వరకు నిధులను వెచ్చించారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది ప్రవాసాంధ్రులు వారి స్వగ్రామాల్లో పి-4 కార్యక్రమం కింద అభివృద్ధి పనులు చేపట్టాలని, పేదరిక నిర్మూలనకు సంకల్పించాలని కోరారు. పూర్వ విద్యార్థి హేమా చలం మాట్లాడుతూ మరల నేను ఈ పాఠశాలను సందర్శించడానికి వచ్చేనాటికి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని, ఆడిటోరియం కింద భాగంలో గచ్చు చేసి విద్యార్థులు ఉపయోగించుకోవటానికి అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విట్టల్ రావు, పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపాలిటీ కూటమి ముఖ్య నాయుకులు పాఠశాల సిబ్బంది, విషన్ 2047 పలాస నియోజ కవర్గ యంగ్ ప్రొఫెషనల్ యు.శ్రీనివాసరావు, విషన్ స్టాఫ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రిటైర్డు హెూంగార్డుకు ఆర్థిక చేయూత



**శ్రీకాకుళం, జనవరి7(వార్త):** ఇటీవల పదవీ విరమణ పొందిన హెూంగార్డు పి.సన్యాసి రావుకు సహచర హెూంగార్డులు ఆర్థిక చేయూత అందించారు. హెూంగార్డు సిబ్బంది స్వతహాగా ముందుకు వచ్చి తమ ఒక్కరోజు గౌరవ వేతనం సమకూర్చి మొత్తం రూ.4.11 లక్షల నగదును సేకరించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా రిటైర్డు హెూంగార్డు సన్యాసిరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సహచర హెూంగార్డులు చూపిన ఈ సహకారం ప్రశంసనీయమన్నారు. పోలీసు శాఖ ఒక కుటుంబం వంటిదని, కష్టసమయాల్లో ఒకరికొకరు అండగా నిలవడమే పోలీసు వ్యవస్థ గొప్పతనమని తెలిపారు. ఇటువంటి సంఘీభావం పోలీసు సిబ్బందిలో ఐకమత్య భావాన్ని మరింత బలపరుస్తుందని అన్నారు. అలాగే ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవితాన్ని గడపాలని విశ్రాంత హెూంగార్డు సన్యాసి రావుకి జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు పరిపాలన అధికారి గోపినాథ్, ఆర్ఎస్ఐ వెంకట రమణ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్‌లో.. పరిశుభ్రతను మెరుగుపర్చండి

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** స్థానిక జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జిల్లా ప్రజా రవాణా సంస్థ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు ఆవరణలో పరిశుభ్రతను పాటిస్తూ మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేటట్లు చూడాలని అధికారులు ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరం ఉన్నచోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లకు వెళ్లే దారిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఔట్సోర్సింగ్ సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రయాణికులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు డ్రైవర్లకు శిక్షణ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. స్త్రీ శక్తి అమలలో భాగంగా మహిళలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. ఇచ్ఛాపురం బస్ స్టేషన్‌కి సంబంధించి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. రోడ్ సేఫ్టీ, పి.జి.ఆర్.ఎస్. కంప్లైంట్స్ తదితర అంశాల గురించి అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా ట్రాన్స్పోర్ట్ అధికారి, సి.హెచ్. అప్పలనారాయణ, శ్రీకాకుళం డిపో మేనేజర్లు ఎం అమర సింహుడు, శర్మ, టెక్కలి డిపో మేనేజర్, శ్రీనివాస్, పలాస డిపో మేనేజర్ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధిలో ఇద్దరూ.. ఇద్దరే..

*** గురుకులాల కోఆర్డినేటర్ యశోదలక్ష్మిని సన్మానించిన ప్రిన్సిపల్ శరత్ బాబు**

*** ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి చేసిన సేవలపై చర్చలు**



**మందస, జనవరి 7(వార్త):** వారిద్దరూ సరస్వతీపుత్రులు.. విద్యాభివద్ధిలో ఇద్దరూ కీలకమే.. ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎంతో శ్రమించారు.. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చారు. వారిలో ఒకరు శ్రీకాకుళంలో పని చేస్తుండగా.. మరొకరు ఇచ్ఛాపురంలో విధులు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపల్‌గా యలక యశోదలక్ష్మి ఎంతో సమర్థవంతంగా పని చేశారు. ఓ వైపు ప్రిన్సిపల్‌గా ఉంటూనే.. విద్యార్థినిలకు జాతీయ సేవా పథకంతో చేసే సేవలు తెలియజేసేవారు. అదేవిధంగా పలు కార్యక్రమాలను ప్రోత్సహించేవారు. యశోదలక్ష్మి పని చేసినన్నాళ్లూ.. గురుకులాన్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉత్తీర్ణతాశాతాన్ని పెంచారు. ప్రభుత్వ లక్ష్యలను ఉన్నత శిఖరాలకు చేర్చి భళా.. అనిపించారు. ప్రస్తుతం యశోదలక్ష్మి గురుకులాల శ్రీకాకుళం జిల్లా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చింతాడ శరత్ బాబు. ఓ ఐకానిక్ నెంబరు. ప్రస్తుతం ఇచ్ఛాపురంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు. ఆయన కూడా విధులు నిర్వహించిన ప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా పని చేస్తున్నప్పుడు సరిహద్దు ప్రాంతాలకు వెళ్లి, ప్రభుత్వ విద్య ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులను కళాశాలలో చేర్పించేవారు. కళాశాల రూపురేఖలు మార్చడంలో, ప్రతిభ చూపిన విద్యార్థులకు తన సొంత నిధులతో ఎంతగానో ప్రోత్సహించేవారు. జాతీయ సేవా పథకం జిల్లా సలహాదారునిగా పని చేస్తున్న సమయంలో శరత్ బాబు చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచాయి. పలు కళాశాలలకు ఎన్ఎస్ఎస్ యూనిట్లను తీసుకురావడంలో ఆయన ప్రధాన భూమిక పోషించారు. అప్పటిలో యశోదలక్ష్మి, శరత్ బాబు ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి చేసిన సేవలు ఫలించాయి. కాగా.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాన్ని తనిఖీ చేయడానికి మందస వచ్చిన ఆమెకు ప్రిన్సిపల్ శరత్‌బాబు ఆయన సతీమణి సిగిలిపల్లి వరలక్ష్మ (దివ్య) మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. యశోదలక్ష్మి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శరత్ బాబు, దివ్య దంపతులు ఆకాంక్షించారు. అప్పటిలో ఈ ప్రాంతంలో చేసిన సేవలను చర్చించుకున్నారు. వారితో పాటు గురుకులం ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా ఉన్నారు.

## పోలీస్ చట్టాలపై అవగాహన

**పోలాకి, జనవరి 7 (వార్త):** పోలాకి మండలం ఈదులవలస మోడల్ పాఠశాలలో బుధవారం శక్తి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోలీసు చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని శక్తి టీం ఇన్‌ఛార్జ్ గిరిధర్ సూచించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి చరవాణిలో శక్తి యాప్ ఉండటం ద్వారా మహిళలు, బాలికలకు తక్షణ రక్షణ లభిస్తుందని తెలిపారు. అలాగే పోక్సో చట్టం ప్రాముఖ్యత, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, పోలీసు సహాయ చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఘటనలు జరిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో శక్తి టీం ఇన్‌ఛార్జ్ హెచ్‌సీ గిరిధర్‌తో పాటు పీసీలు యమున, రమణమ్మ పాల్గొని విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.

## 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ

**సారవకోట, జనవరి 7 (వార్త):** సారవకోట మండలం పరిధిలోని అలుదు దుర్గ రైస్ మిల్లును జెడ్పీ సీఈవో డి. సత్యనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడారు. ధాన్యం విక్రయానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన రైతులను కోరారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ, రైతులు అందించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని భరోసా ఇచ్చారు. మిల్లుకు లోడ్ వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా అన్‌లోడింగ్ చేయాలని మిల్లుయాజమాన్యానికి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ అప్పన్న, పంచాయతీ కార్యదర్శి హైదర్ అలీ బేగ్, రైతులు పాల్గొన్నారు.

## ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించాలి

**నరసన్నపేట, జనవరి 7(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలను విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సూచించారు. బుధవారం నరసన్నపేటలోని బోర్డు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో అన్ని నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలని హెచ్‌ఎం శ్రీనివాసరావుకు సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, క్రమశిక్షణతో పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి లేకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడమే విద్యాశాఖ లక్ష్యమని ఎంఈఓలు స్పష్టం చేశారు.

## సైబర్ నేరగాళ్లతో అప్రమత్తం

**పలాస, జనవరి 7 (వార్త):** సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ ఎస్ఐ ఆర్.నరసింహమూర్తి ప్రజలను అప్రమత్తం చేశారు. బుధవారం రాత్రి పలాస మండలంలోని గురుదాసుపురం గ్రామాన్ని సందర్శించి, నారీ శక్తి, సైబర్ నేరాలు, సంకల్పం, మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు మొదలైన వాటిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ ఎస్.ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ పోలీసులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం క్రెడిట్ వైసీపీదే

**జి.సిగడాం, జనవరి7,(వార్త):** భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి కృషి చేసినది నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వానిదని, 100 శాతం క్రెడిట్ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, జి.సిగడాం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎర్నెన ప్రకాష్ అన్నారు. మండల కేంద్రం జి.సిగడాం లో వారు బుధవారం విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 4న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి అంతర్జాతీయ వాణిజ్యవ్యాలిడేషన్ విమానం ల్యాండ్ కావడం ఆనందంగా ఉందన్నారు. ఎప్పుడూ వెనుకబడిన ప్రాంతమని చెప్పుకునే ఉత్తరాంధ్రకు నేడు ప్రపంచపటంలో ఓ స్థానం దొరికిందన్నారు. భోగాపురంలో రూ.4,500 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి కృషి చేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన జీఎంఆర్ సంస్థకు, నిర్మాణా నికి భూములు ఇచ్చిన రైతులకు ఆ ప్రాంత ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన పనులను ఇప్పుడు కూటమి ప్రభుత్వం తానే చేసానని చెప్పుకోవడం సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. రైతులకు సకాలంలో ఎరువులను అందించడంలో ఈ ప్రభుత్వం విఫలం చెందారన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ ప్రతినిధి పున్నాన అక్కలనాయుడు, దారబొయిన దర్మరాజు, ఎంపీటీసీ ప్రతినిధి మక్క శ్రీనివాసరావు ఉన్నారు.

## త్యాగరాజు స్వామి ఆరాధన మహెూత్సవాల కరపత్రం విడుదల




**ఇచ్ఛాపురం,జనవరి 7 (వార్త):** ఇచ్ఛాపురం మండలం కేసుపురం గ్రామంలో ఈనెల 10 11 12 వ తేదీల్లో మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత జగద్గురు సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధన మహెూత్సవాల కరపత్రం సంస్థ ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, సంస్థ సభ్యులు మరియు గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అంశాలు పదవ తేది శనివారం ఉదయం 9 గంటలకు శ్రీ త్యాగరాజు స్వామి చిత్రపటం వేషాధారణ ప్రాముఖ్యతగా స్వామి వారి కీర్తనలు, డోలు సన్నాయి నాదస్వరం, ఉత్తమ ప్రదర్శన గల కోలాట బృందాలు, బాణాసంచాలతో ఘనంగా ఊరేగింపు, అనంతరం డాక్టర్ మావుడూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక పంచరత్న సేవ వేదనాదంతో, అనంతరం శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించబడును. 11వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంకాలం 7 గంటల వరకు ప్రాంతీయ కళాకారులచే త్యాగరాజ స్వామి వారి కీర్తన గానం ఆరాధన, ప్రత్యేక నృత్య ప్రదర్శన నిర్వహించబడుతుంది. 12వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రత్యేక కళాకారులచే స్వామి వారి ఆరాధన, మూడు గంటలకు డాక్టర్ మావుడూరు సత్యనారాయణ శర్మ చే ఐదున్నర గంటల వరకు శాస్త్రీయ సంగీత కచేరి. తదుపరి చిన్నా గురుస్వామి ఆధ్వర్యంలో వెంకటేశ్వర డాన్స్ అకాడమీ చిన్నారులచే కూచిపూడి భరతనాట్యం నిర్వహించబడును. పాల్గొన్న ప్రతి కళాకారులకు భోజన సదుపాయం, అల్పాహారం, పాల్గొన్న ప్రతి కళాకారులకు ప్రత్యేకంగా ఘన సన్మానం నిర్వహించబడునని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ ప్రధాన సలహాదారులు తిప్పన దాలయ్య రెడ్డి, అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, ఉపాధ్యక్షులు నర్తు గంగయ్య మాస్టర్ ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, కోశాధికారి కొప్పల హేమంత్, బోర రామారావు, దూట్ల వెంకటేశం, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, గ్రామ నాయుడు సూరు కామరాజు, బుడత ప్రకాష్, గుజ్జు ఎర్రయ్య, బుడత శ్యామసుందర్, బుడత మల్లేష్, సూరు రమేష్, మాన్యల జానకిరావు, గుజ్జు భీమరాజ్, గుజ్జు సత్యం నీలగిరి ప్రశాంత్, బుడత వెంకట్రావు, బుడత తిరుపతి రావు, దున్న చిరంజీవి, గుప్పి కుమారస్వామి, బుడత మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాశీబుగ్గలో వేంకటేశ్వర స్వామి ఆలయం పరిశీలన



**పలాస, జనవరి 7 (వార్త):** కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ( చిన్న తిరుపతి) ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి, రాయవలస ఎండల మల్లిఖార్జునుడి దేవస్థానం సెక్రటరీ గురునాథరావు బుధవారం పరిశీలించారు. గత ఏడాది నవంబర్‌లో ఏకాదశి రోజున కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది భక్తులు మృత్యువాత పడటంతో ఆలయాన్ని మూసి వేశారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీ ( రెవెన్యూ, పోలీసు, ఎండోమెంట్ ముగ్గురు అధికారుల) సూచనలతో వేంకటేశ్వర ఆలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆలయంలోకి ఎవరూ ప్రవేశించ కుండా భద్రతను కట్టు దిట్టం చేశారు. ఆలయాన్ని పునః ప్రారంభించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తొక్కిసలాట వంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా భక్తుల రక్షణార్థం సకల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆలయ ధర్మకర్త హరి ముకుంద పండాను అధికారులు విజ్ఞప్తి చేశారు. ఆలయంలో క్యూలైన్లు, బారికేడ్లు, గ్రిల్స్ ఐరన్ రెయిలింగ్స్, ఎగ్జిట్ మార్గాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో వాటిని ఎండోమెంట్ , రెవెన్యూ, పోలీసు అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. త్రిసభ్య కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పునః ప్రారంభించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎండోమెంట్ అధికారి గురునాథ్ వెల్లడించారు.

## సర్పంచ్‌పై దాడి ప్రజాస్వామ్యంపై దాడే



**నరసన్నపేట, జనవరి 7 (వార్త):** జలుమూరు మండలం టెక్కలిపాడు పంచాయతీ సర్పంచ్ ధర్మాన బువ్వాజీపై టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి అమానుషమని వైకాపా యువ నాయకుడు, పోలాకి జడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య తీవ్రంగా ఖండించారు. ప్రజల మౌలిక అవసరమైన శానిటేషన్ పనులు నిర్వహిస్తున్న సందర్భంలో సర్పంచ్‌పై దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న సర్పంచ్ బువ్వాజీని డాక్టర్ కృష్ణచైతన్య పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం వైకాపా నాయకులతో కలిసి జిల్లా ఎస్పీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులైన టీడీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ, పండగ సమీపిస్తున్న నేపథ్యంలో టెక్కలిపాడు పంచాయతీలో శానిటేషన్ పనులు నిర్వహిస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకోవడమే కాకుండా విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపించారు. తాము అధికారంలో ఉండగా సర్పంచ్ ఎలా పనులు చేయిస్తాడని ప్రశ్నించడం చూస్తే నరసన్నపేట నియోజకవర్గంలో రాజ్యాంగం అమలవుతున్న తీరే అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించిన కృష్ణచైతన్య, సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి టీడీపీ నాయకులు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి ఘటనలను వైకాపా ఊరుకోదని, ప్రజలపై జరుగుతున్న ప్రతి దాడిని గుర్తుపెట్టుకుంటామని హెచ్చరించారు. పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి న్యాయం చేయాలని, బాధితుడికి పూర్తి రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర–జిల్లా స్థాయి నాయకులు, మండల అధ్యక్షులు, యూత్ మరియు మహిళా విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 9న సిక్కోలు రథసప్తమి వేడుకలకు అంకురార్పణ

**శ్రీకాకుళం, జనవరి 7(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ దేవస్థానంలో ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్న రథసప్తమి వేడుకల అంకురార్పణ (కర్టెన్ రైజర్) కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 9న ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న ఈ వేడుక ఏర్పాట్లను బుధవారం ఉదయం ప్రత్యేక కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో దాదాపు 200 మందితో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించేందుకు అనువైన వేదికను సిద్ధం చేయాలని వారు సూచించారు. రాష్ట్ర పండుగగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో వివిధ శాఖల సమన్వయం ఎంతో అవసరమని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో జిల్లా ఆయుష్ వైద్యాధికారి జగదీష్, సోషల్ వెల్ఫేర్ డిడి మధుసూదనరావు, డీఐపీఆర్వో చెన్నకేశవరావు, యోగా గురువు పాండ్రంకి మురళి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొంక్యాన మురళీధర్, మంత్రి వెంకటస్వామి, ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలన



**నరసన్నపేట, జనవరి 7 (వార్త):** నరసన్నపేట మండలం గుండివిల్లిపేటలోని మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేసి, నాణ్యమైన భోజనాన్ని నిరంతరం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళికపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. అలాగే టీఐఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని, సిబ్బంది అందరూ టీఐఎస్ పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు సూచించారు.

## నగిరికటకంలో 'పొలం పిలుస్తోంది'




**జలుమూరు, జనవరి 7 (వార్త):** జలుమూరు మండలంలోని నగిరికటకం గ్రామంలో బుధవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని ఏవో రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు మొక్కజొన్న పంట సాగు ద్వారా కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటకు అవసరమైన సాగు విధానాలు, పంటను ప్రభావితం చేసే తెగుళ్లు, వాటి నియంత్రణకు ఉపయోగించాల్సిన క్రిమిసంహారక మందుల గురించి ఏవో రవికుమార్ వివరించారు. పంట దిగుబడి పెంచేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతులకు ఉపయోగపడే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని పాల్గొన్న రైతులు అభిప్రాయపడ్డారు.

## నరసన్నపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నరసన్నపేట, జనవరి 7 (వార్త):** నరసన్నపేట మండలంలోని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు నరసన్నపేట సివిల్ జడ్జి శ్రీవాణి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీ వాణి మాట్లాడుతూ, నేటి యువత డ్రగ్స్‌కు బానిసవుతున్న పరిస్థితి ఆందోళనకరమని పేర్కొన్నారు. ఈ దుష్ప్రవర్తనను అరికట్టేందుకు ప్రభుత్వాలు వివిధ చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి స్వీయ నియంత్రణపాటిస్తే డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండవచ్చని సూచించారు. విద్యార్థులు మంచి విలువలు అలవర్చుకుని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షంచారు. న్యాయ విజ్ఞాన సదస్సు విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రమాదకరంగా మ్యాన్‌హెూల్



**నరసన్నపేట, జనవరి 7 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని స్థానిక బొడ్డవలస వద్ద బజారుకు వెళ్లే రహదారి కూడలి వద్ద ఉన్న మ్యాన్‌హెూల్ పలక విరిగి నేటికీ మూడు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రద్దీగా ఉండే ఈ కూడలిలో విరిగిన మ్యాన్‌హెూల్ పలక వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేదని స్థానికులు తెలిపారు. రోజూ వాహనాలు, పాదచారులు అధికంగా రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి వెంటనే మ్యాన్‌హెూల్‌ను బాగుచేసి ప్రయాణికుల భద్రతను కాపాడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. ప్రమాదం జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546